

రేపు ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

కడప అర్బన్ : ఈనెల 30, 31న నిర్వహించబోయే భారత విద్యార్థి ఫెడరేషన్ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయక్, సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ 1970, డిసెంబర్ 30న అధ్యయనం-పోరాటం నినాదంతో స్వాతంత్య్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఏర్పాటయిందని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఏదీ 'పింఛన్'

- వేలాది మందికి నోటీసులు జారీతోవిలవిల
- తమ జీవనమెలా అంటూ ఆవేదన
- పునఃపరిశీలన జాబితాలో వేలాది మంది
- తాఖీదులు వచ్చిన వారికి జనవరిలో కష్టమే

కన్నవారి ఆదరణ కరువై, కట్టుకున్న వారి తోడుకు దూరమై ఫించన్ మీదే ఆధారపడి బతుకుతున్న వారు ఎందరో అలాంటి వృద్ధులు, వితంతువులు, విభిన్నప్రతిభావంతుల పింఛన్లను తొలగిస్తూ వారి గుండెకోతకు కారణమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి నుంచి కొత్త పింఛన్లు ఇస్తామని గొప్పలు చెప్పిన వైసిపి ప్రభుత్వం లేనిపోనిసాకులతో పింఛన్లు తీసివేయడంపై నిరుపేదలు లబోదిబోమంటున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 2,43,315 మంది, అన్నమయ్య జిల్లాలో 2,15,552 మంది వైఎస్ఆర్ పింఛను తీసుకుంటున్నారు. ఉభయ జిల్లాల్లో వేలాది మందికి అనర్హత పేరిట నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 30 వేల మందికి సచివాలయాల వారీగా అధికారులు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా ఆధారాలు నిరూపించుకోకపోతే జనవరి నెల నుంచి వారికి పింఛను అందదు. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు విలవిల్లాడిపోతున్నారు. -ప్రజాశక్తి - యంత్రాంగం

పింఛను తొలగించడం అన్యాయం



ఆకస్మికంగా పింఛను తొలగించడం అన్యాయం. 11 ఏళ్ల నుంచి వికలాంగుల పింఛను వస్తోంది. రూ.3 వేలు ఇస్తుడడంతో సంతోషంగా ఉండేది. రెండు రోజుల క్రితం వాలంటీర్ వచ్చి పింఛను రద్దయిందని చెప్పారు. నా సోదరుని రేషన్‌కార్డులో నా పేరు ఉంది. అన్నకు కారు ఉందనే కారణంతో నాకు వస్తున్న పింఛను రద్దు చేశారు. పింఛను లేకపోతే ఇబ్బందిగా ఉంటుంది. సచివాలయం వద్దకు వెళ్లితే రేషన్ కార్డులో పేరు మార్చుకోవాలని చెప్పారు.

- ఎం.రవికుమార్‌రెడ్డి, విభిన్నప్రతిభావంతుడు, వేంపల్లె.

పింఛను కొనసాగించాలి



తన భర్త చనిపోవడంతో ఆరేళ్లుగా తనకు వితంతు పింఛను వస్తోంది. తన పేరుతో ఇళు ఉందని నోటీస్ ఇచ్చారు. తనకు ఇప్పుడు పెన్షన్ తొలిగిస్తే నేను ఎలా జీవించాలి. తన వయసు 65 సంవత్సరాలు. తనకు జీవనాధార లేదు అధికారులు స్పందించి తనకు వస్తున్న పెన్షన్ కొనసాగించాలి.

- సి.హుసేన్‌బీ, కొత్తపేట, రాయచోటి.

పింఛను ఇప్పించండి



గతంలో ఎప్పుడు లేని విధంగా ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్ లేదని పింఛను ఇవ్వడం లేదు. అన్ని అర్హతలు ఉన్నా పెన్షన్ రాకపోవడంతో జీవనం దుర్భరంగా మారింది. పెన్షన్‌కు దరఖాస్తు చేసుకొన్నా ఇంకా పెన్షన్ రాలేదు. అధికారులు చొరవ చూపి పెన్షన్ ఇప్పించాలి.

- సయ్యద్‌బాషా, కలికిరి.

15 ఏళ్లుగా పింఛను వస్తోంది



తనకు 15 ఏళ్లుగా వికలాంగుల పెన్షన్ వస్తోంది. సదరంలో డాక్టర్లు, ముగ్గురు కమిటీ నెంబర్లు ఆధ్వర్యంలో వికలాంగులని నిర్ధారణ చేసి తనకు పింఛను మంజూరు చేశారు. తన ఆధార్ నెంబర్‌కు రాయచోటి పట్టణానికి చెందిన తిరుపతి చిన్న రెడ్డప్పకు చెందిన ఆస్తులను జమ చేశారనే సాకుతో సచివాలయ అధికారులు నోటీసులు ఇచ్చారు. మున్సిపల్ అధికారులను కలవగా స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌ను కలవమని చెబుతున్నారు. తాను తిరుపతి చిన్న రెడ్డప్ప కోసం పట్టణమంతా వెదుకుతున్నాను. ఇంత వరకు ఆయన ఆచూకీ కనిపించడం లేదు. అధికారులు స్పందించి తనకు పింఛనును కొనసాగించాలి.

- బుక్కే శివకుమార్, విభిన్నప్రతిభావంతుడు, రాయచోటి.

మూన్నెళ్లుగా పింఛను ఇవ్వలేదు



పింఛనుకు దరఖాస్తు చేసి మూడు నెలలు కావస్తున్నా ఇంకా రాలేదు. జీవితం దుర్భరంగా మారి బిక్షాటన చేస్తున్నా. అధికారులు త్వరితగతిన పెన్షన్ మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను.

- నరసమ్మ, సిటిఎం, మదనపల్లి.

బిల్లు అధికంగా వచ్చిందని...



విద్యుత్ బిల్లు మూడు వందల యూనిట్లకుపైగా వస్తోందని పింఛను రద్దు చేస్తున్నట్లు వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. వయసు మీద పడి ఒక కాలు పూర్తిగా లేకపోవడంతో ఎలాంటి జీవనాధారం లేదు. ప్రభుత్వం నుంచి వస్తున్న పెన్షన్ సహాయం కూడా అందకపోతే జీవనాధారం కష్టతరమవుతుంది. పదేళ్ల కిందట నాతో వేరుపడిన కుమారుడిపై ఉన్న ఇంటిపై వస్తున్న కరెంటు బిల్లును నా పేరును చూపిస్తున్నారు.

- మల్కిగారి ఇబ్రహీం, చాపాడు.

భూమి ఉందని నోటీసు ఇచ్చారు



పింఛను నిలుపుదలపై నాకు నోటీసు అందజేశారు. నాకు 1.44 ఎకరాలుంది. నా పేరుపై వెబ్ ల్యాండ్‌లో మూడు ఎకరాల మాగాని, 20 ఎకరాల మెట్ట పొలం ఉందని కారణంతో పెన్షన్ తొలగింపుపై నోటీసు అందజేశారు. నాకు అంత పొలం లేదు. తహసిల్దార్ కార్యాలయానికి వెళ్ళి వినతి పత్రాన్ని కూడా అందజేశాను. నాకు పెన్షన్ పునరుద్ధరించాలని కోరుకుంటున్నా.

- సవరం పాపులమ్మ, పోరుమామిళ్ల.

ఇంటి స్థలముందని తొలగించారు



గతంలో తన కుమారుడికి ప్రభుత్వం డికెటి ఇంటి పట్టా ఇచ్చింది. దానిని పూట గడవక అమ్ముకున్నాం. తాముండే ఇళ్లు కూడా డికెటి స్థలం. పింఛను ఎందుకు రద్దు చేశారని అడిగితే ఇంటి స్థలం ఎక్కువ ఉందని పోయిందంటున్నారు. 500 అడుగుల స్థలం మాత్రమే ఉంది. తాము అమ్ముకున్న స్థలంను తీసివేయమని అధికారులను అడుగుతుంటే ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు.

- రహిమాన్ మహబూబి, వృద్ధురాలు, జమ్మలమడుగు.

అధిక ఇంటి స్థలం ఉన్నట్లు నోటీసు



మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి చదరపు అడుగులకుపైగా ఇంటి స్థలం ఉందని పెన్షన్ తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పాతపాలెంలో నివాసం ఉన్న ఇంటితో పాటు పశువుల పాకకు సంబంధించిన స్థలం ఉంది. పెన్షన్ తొలగింపు నిర్ణయం సరికాదు.

- జి.ఓబులరెడ్డి, మైదుకూరు.

పింఛను పునరుద్ధరించాలి



నాకు ఎలాంటి ఆస్థి లేదు. అధిక కరెంటు బిల్లు కూడా రాలేదు. అయినా నా పింఛను తొలగించారు. ప్రభుత్వం అందించే సామాజిక పింఛను పైనే జీవనం కొనసాగిస్తున్నాను. దయచేసి తొలగించిన పింఛను పునరుద్ధరించాలి.

- బి.సునీల్ కుమార్, విభిన్న ప్రతిభావంతుడు, రాజంపేట.

విద్యార్థులకు వరం ట్యాబ్‌లు

ప్రజాశక్తి-చెన్నూరు



కడప : ట్యాబ్‌లతో విద్యార్థులు

విద్యార్థులకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందించే వరమే ట్యాబులని కమలాపురం ఎంఎల్ఎ పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలికల హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలు పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం అందించలేదని అన్నారు. నాడు నేడు కింద పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. మండలంలోని 279 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి. మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, ఎంపిటిసిలు నాగిరెడ్డి, పార్టీ నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, రఘురాం రెడ్డి, అన్వర్ సాబ్, మహమ్మద్ రబ్, ఆర్ వెంకట సుబ్బారెడ్డి, పంచులు తుంగ చంద్ర యాదవ్, వెంకటసుబ్బయ్య, ఎస్వి నారాయణరెడ్డి, ప్రతికుమార్ రెడ్డి, సురతాని శ్రీనివాసులు, అధికారులు ఎంఇఒ రాణి, ఇఒపిఆర్‌డి సురేష్ బాబు, పిఆర్ఎఇ మూర్తి మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, అందుకోసమే ప్రతి విద్యార్థికి ట్యాబ్‌లు పంపిణీ చేసి టెక్నాలజీతో విద్యను బోధిస్తున్నారని ఆంధ్ర ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎస్‌టి హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ అందించిన ట్యాబ్‌లను రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం యువ నాయకుడు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, వార్డెన్లు శ్రీనివాసులు, బాలుడు, మునెయ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. **కాశినాయన:** మండల పరిధిలోని వరికుంట్ల ఎంపియుపి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు జడ్‌పిటిసి సత్యనారాయణ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరి వారి కుటుంబ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రఘురామయ్య ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ భాస్కర్ రెడ్డి స్కూల్ చైర్మన్ రవీంద్రారెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** జిల్లా పరిషత్ పాతకడప హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం 1వ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య ట్యాబ్‌లు అందజేశారు. 76 మంది విద్యార్థులు ట్యాబ్‌లు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నమ్మ, పాల్గొన్నారు.

పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలి

కడప అర్బన్ : ప్రభుత్వం తొలగించిన వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళ సామాజిక భద్రత పింఛన్లను పునరుద్ధరించాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గురప్ప డిమాండ్ చేశారు. బుధవారం బిఎస్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఇవ్వాలంటే పాత పింఛన్లను అడ్డగోలు విధానాలతో రద్దు చేస్తూ నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గత ఏడాది కూడా అనేకమంది పింఛన్లను తొలగించిందని విమర్శించారు. ఇద్దరికి కొత్తగా పింఛన్ ఇవ్వడం నలుగురికి తీసేయడం ఇదేనా జగన్ మార్క్ సంక్షేమమని మండిపడ్డారు.

6 నెలల సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-కడప సిటీ

2020-21లో కోవిడ్-19 సమయంలో రిమ్స్‌లో పనిచేసిన పారామెడికల్ సిబ్బందికి 6 నెలల సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఎపి మెడికల్ అండ్ హెల్త్ వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర నాయకులు ఆదాల వెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 6 నెలల సర్వీసుకుగానూ 5 నెలల 15 రోజుల ఇచ్చారని పేర్కొన్నారు. దీని వల్ల సిబ్బందికి నష్టం వాటిల్లిందని తెలిపారు. కోవిడ్ సమయంలో రిమ్స్‌లో 64 మంది స్టాఫ్ నర్సులను నియమించారని పేర్కొన్నారు. ఇటీవల రీజనల్ డైరెక్టర్ విడుదలచేసిన సీనియార్టీ లిస్టులో స్టాఫ్ నర్సులకు తక్కువ వెయిటేజ్ మార్కు లొచ్చాయన్నారు. దీనికి కారణం 6 నెలలు పని చేసిన వారికి 5 నెలల 15 రోజుల సర్వీసు ఇవ్వడే మనని వాపోయారు. వెంటనే కలెక్టర్ స్పందించి స్టాఫ్‌నర్సులకు 6 నెలలకు సంబంధించిన సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు

మూడున్నరేళ్ల వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో సతమవుతమవుతున్నారని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువనేత రితేష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారు. బుధవారం సాయంత్రం పిపికుంట , చిన్న పిపి కుంట పరిధిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో వైసిపి నాయకులు ఇచ్చిన ఊక దంపుడు హామీలకు ప్రజలు నమ్మి ఒక్క అవకాశం ఇచ్చారని, ఇప్పుడు వారిని నట్టేట ముంచిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలని చెప్పారు. కార్యక్రమంలో గోపవరం మండలానికి చెందిన తెదేపా చెందిన కార్యకర్తలు,నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **వల్లూరు :** రాష్ట్రానికి పట్టిన కర్మను వదిలించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని తప్పెట్లలో నియోజకవర్గ పుత్తా నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు ప్రజలతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఎక్కడ లేని విధంగా పెరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి రాఘవరెడ్డి , చిట్టి బాబు, పుల్లారెడ్డి, సదాశివారెడ్డి, సుబ్బారెడ్డి, చంద్ర ఓబుల్ రెడ్డి, శివారెడ్డి ,వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. **కడప అర్బన్ :** తుగ్లక్ పాలన చేస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న జగన్ సర్కార్‌పై తిరుగుబాటు చేసేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జి బి.హరిప్రసాద్ అన్నారు. బుధవారం 22వ డివిజన్ గోపిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల తొలగింపు ధరల పెంపు, మౌలిక వసతుల కరువుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకుల ఎం.పి.సురేష్, యాటగిరి రాం ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్నకలెక్టర్ విజయరామరాజు

జగనన్న గృహ నిర్మాణ పథకం, ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్ వి. విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్‌లో గృహ నిర్మాణశాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలు, ప్రయారిటీ బిల్డింగ్‌ల నిర్మాణ పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఒటిఎస్ ప్రక్రియను యాక్షన్ ప్లాన్ తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ, రిజిస్ట్రేషన్, గ్రౌండింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తి చేయాలని అన్నారు. తప్పక జియో ట్యాగింగ్ ఎప్పటికప్పుడు చేయాలని తెలిగిన వెంటనే ఆన్లైన్ లో నమోదు చేసి చూపాలన్నారు. గృహ నిర్మాణాల లక్ష్య సాధన కోసం మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోజూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రతి అధికారి నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెసి సాయికాంత్ వర్మ, కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేష్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, అనుబంధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

మహాసభలు జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బాలకాశి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బాలకాశి

నగరంలో ఈ నెల 29,30 తేదీల్లో నిర్వహించే సిఐటియు జిల్లా 9వ మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి బాలకాశి పిలుపు నిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక వర్గాలకు, పోరాటాలకు సిఐటియు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహాసభలకు ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ హాజరవుతారని తెలిపారు. మొదటి రోజు ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. కార్మికులు, ఉద్యోగులు, నగర ప్రజలు, అనుబంధ సంఘాలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. దేశ స్వావలంబన, ఆర్థిక విధానాలకు, లౌకిక రాజ్యాంగానికి మద్దతుగా, కులవివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం సిఐటియు పోరాడుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ ఐద్య ఉద్యమాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, బ్యాంక్, రణ రంగం, డిఆర్‌డిఒ, ఇస్రో, ఎస్‌బిఐ, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, స్టీల్, కోల్, ఎలక్ట్రిసిటీ, రోడ్డు రవాణా, రైల్వే ఉద్యోగుల పోరాటాలకు దిశ నిర్దేశం చేయడంతో పాటు సిఐటియు నికరంగా పోరాడుతుందని తెలిపారు. గురువారం ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం నుంచి పాత కలెక్టరేట్ వరకు ఉంటుందని తెలిపారు. కార్పొరేషన్ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, కార్యదర్శులు లక్ష్మిదేవి, జి.చంద్రశేఖర్, కె.శ్రీనివాసులు, పి.వి.సుబ్బయ్య, రామమోహన్ పాల్గొన్నారు.

యువత వేగాన్ని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

కాలా నుగుణంగా యువత వేగాన్ని అందిపు చ్చుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి బ్రహ్మయ్య పిలుపు నిచ్చారు. బుధవారం నిహార్ స్కిల్ సెంటర్‌లో నెహ్రూవ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'లీడర్ షిప్ కమ్యూనిటీ డెవల ప్‌మెంట్' అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అనుకుంటే సాధించలేనిది ఏమి ఉండదన్నారు. అమ్మాయిలు అబ్బాయిలకంటే ముందుంటున్నారని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర యువతకు మాత్రమే ప్రత్యేకంగా ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయని చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో పురులకంటే మహిళ ఉద్యోగులు అధికంగా ఉన్నారని తెలిపారు. జిల్లా వైద్య విద్య అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు అందిపుచ్చుకోవాలని పిలుపు నిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అదికారి మణికంఠ మాట్లాడుతూ మూడు రోజులపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కేరీర్ గైడెన్స్ కమ్యూనికేషన్ స్కిల్స్ పై యువతకు శిక్షణ, సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. పరిశ్రమల కేంద్రం ప్రమోషన్ ఆఫీసర్ నిశాంత్ యువతకు డిఐసి అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో యువత, ఎన్‌వైకె సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

డ్రగ్ కంట్రోల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో మెడికల్ మాఫియాను అరికట్టడంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు విఫలమయ్యారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, నగర కార్యదర్శి డి. ఎం.ఓబులేసు విమర్శించారు. బుధవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా మెడికల్ షాపులు ఉన్నాయని పేర్కొన్నారు. అనేక నకిలీ కంపెనీల మందులు అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. అవసరం ఉన్నా లేకున్నా తమ షాపుకు వచ్చే రోగిని భయపెట్టి యాంటీబయోటిక్ పేరుతో వందల రూపాయలు విలువచేసే మందులు అంటగట్టి రోగి జేబులు ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. డిస్కౌంట్లు వచ్చే జనరిక్ మందులును సైతం వందలాది రూపాయలకు విక్రయిస్తూ అక్రమార్జనే ధ్యేయంగా మెడికల్ షాప్ యాజమాన్యాలు విక్రయాలు జరుపుతున్నారని చెప్పారు. వీటిని అరికట్టడంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత అధికారులు ఈ మెడికల్ మాఫియా పైన దృష్టి పెట్టి అక్రమాలకు పాల్పడుతున్న మెడికల్ షాప్‌లా లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు విజయ్, జగదీష్ పాల్గొన్నారు.

తాలూకా పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని తాలూకా, చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి వెంకట శివారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాత కేసుల పురోగతిపై ఆరా తీశారు. ఫిర్యాదు దారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని చెప్పారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ ఉలసయ్య, శ్రీరాం శ్రీనివాసులు, ఎస్ఐలు రామకృష్ణ, తాహీర్ హుస్సేన్, అమర్‌నాథ్‌రెడ్డి, రోషన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హులందరికీ సామాజిక పింఛన్లు ఇస్తున్నారని డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు తొలగించారని ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. నోటీసులకు సరైన వివరణ ఇస్తే సరిపోతుందని తెలిపారు. అర్హత ఉన్నట్లు తేలితే పింఛను ఇస్తారని చెప్పారు. వైసిపి అధికారంలోకి ఇచ్చిన తరువాత ఒకటవతేదీ పింఛన్లు ఇస్తున్నారని, సంఖ్య కూడా పెరిగిందన్నారు. వాలంటీర్లు సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పక్షాలు ఆందోళన చేయడం తగదన్నారు.

అధిక దిగుబడి సాధించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

రైతులు పట్టు పురుగులు పెంపకంలో అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఎస్.శివప్రసాద్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం మైదుకూరు శ్రీ శక్తి భవన్‌లో పట్టు రైతులకు మూడు రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరులో పట్టు పరిశ్రమ చేపట్టడానికి అనుకూల వాతావరణ ఉందని తెలిపారు. రైతులు ముందుకు వచ్చి పట్టు పరిశ్రమ చేపట్టాలని కోరారు. పట్టుపురుగుల పెంపకం, అవసరమైన పరిజ్ఞానాన్ని తెలియజేసే సమాచార కర దీపకలు ఉచితంగా పంపిణీ చేశారు.


అంగన్వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

ప్రజాశక్తి-పోరుమామిళ్లటౌన్

పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీరామ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, హెచ్‌ఆర్‌సి రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి మనవడు పార్థ శివాన్ష్ మొదటి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని బుధవారం స్థానిక అంగన్వాడీ కేంద్రానికి 20 కుర్చీలను వితరణ చేశారు. చిన్నారులు చదువు కునేందుకు, భోజనాలు చేసేందుకు ఉపయోగకరమైన కుర్చీలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్థశివాన్ష్‌ు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన మాసాపేట శివ

ప్రజాశక్తి - కడప అర్బన్




లోకేష్ తో మాసాపేట శివ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్ త్వరలో చేపటబోయే పాదయాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం చోటు చేసుకుంటున్న పరిమాణాలు, అరాచకాలు, యువత చెడు అలవాట్లకు, మత్తుకు బానిసవుతున్నారని, ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ టిడిపి విజయం కోసం ప్రతి కుటుంబాన్నీ కలసి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, దౌర్జన్యలను, వైఫల్యాలను, అన్యాయలను, ప్రస్తుత పరిస్థితులను ప్రజలకు వివరించాలని చెప్పారు. పార్టీ కష్ట కాలంలో కష్ట పడి పనిచేసే వారికి తప్పకుండా మంచి భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అనిల్, ఎస్‌సి సెల్ నగర కార్యదర్శి బిల్లా నవీన్, ఎస్టీ సెల్ నగర ఉపాధ్యక్షులు కనూరు నాగార్జున, కార్తిక్,సుబ్బు పాల్గొన్నారు.

తేక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్



క్రీడాకారులతో వివేకానందరెడ్డి

నగరంలోని చిన్న చౌక్‌లో ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తేక్వాండో పోటీలలో ప్రతిభ చూపించారని స్కూల్ డైరెక్టర్ ఎం.వివేకానందరెడ్డి తెలిపారు. బుధవారం మెడల్స్, ట్రోఫీ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ముఖ్యమని చెప్పారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఒంగోలులో నిర్వహించిన నేషన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో లోకేశ్వర రెడ్డి బంగారు, శ్రీనివాసులు కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. కోచ్ వెంకటేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పిఇటిలు జయచంద్ర, లక్ష్మయ్య పాల్గొన్నారు.

500 పుస్తకాలు బహూకరణ

కడప అర్బన్ : లండన్‌లో జనరల్ సర్జన్‌గా పనిచేసిన రిటైర్డ్ వైద్యులు డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తి 500 పుస్తకాలను బుధవారం హైదరాబాదులోని తన స్వగృహంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరి భూషణరావు, సిబ్బంది పి.చంద్రకిశోర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మూర్తి బహూకరించిన అమూల్యమైన 500 గ్రంథాలున్నాయని చెప్పారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు దస్తగిరి

మండలంలోని తాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ప్రధానో పాధ్యాయులు ఎం.దస్తగిరి, ఉప సర్పంచు రామ కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను యుటిఎఫ్ ఉపాధ్యాయులు చెరుకూరు శ్రీనివాసులు, అబ్దుల్ ఆర్థికసాయంతో విద్యార్థులకు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, భవాని, అబ్దుల్, నాగ మునిలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ గంగాదేవి, సిఆర్‌పి కళ్యాణి, డిజిటల్ ఉపాధ్యాయురాలు లక్ష్మి, ఫణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోమియో మందులు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

కరోనా, సీజనల్ వ్యాధుల నివారణ కోసం ముందస్తు జాగ్రత్తలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హోమియో మందులను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ హోమియో వైద్యురాలు ఎస్.రాజేశ్వరి తెలిపారు.



హోమియో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

మండలంలోని అనంతపురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ ఈ మందులు వేసుకోవడం ద్వారా విద్యార్థులలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కరోనా నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. తరచూ చేతులను కడుగుతూ, పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి, కాంపౌండర్ డి.రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరేంద్రకుమార్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఖాజీపేట



మండలంలోని బి.తిప్పాయపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి నరేంద్రకుమార్‌రెడ్డి ఐఐటి భువనేశ్వర్ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఆయన 'యూనిఫైడ్ క్వాలిటీ-అవేర్ డేటా కంప్రెషన్ అండ్ పల్స్ అండ్ రెస్పిరేషన్ రేట్ ఎక్స్‌ట్రాక్షన్ ఫ్రేమ్ వర్క్స్ ఫార్ రిసోర్స్-కన్‌స్ట్రెయిన్డ్ వియరబుల్ హెల్త్ మానిటరింగ్ డివైజెస్' అను అంశంపై డాక్టర్ ఈలరెడ్డి మణికందన్, డాక్టర్ ఎమ్.సబరి మూర్తి పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. బిటెక్ (ఐసిఇ) జెఎన్ టియు పులివెందులలో చదివారు. ప్రాథమిక విద్య ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాల (బి.తిప్పాయపల్లె), 6,7 మైదుకూరు శారద పాఠశాల, 8,10 తరగతి ఎపి ఆర్‌ఎస్ ముక్కవారిపల్లె, ఇంటర్ చైతన్య కళాశాల గుంటూరులో చదివారు. ఆయన సాధించిన విజయం పట్ల కుటుంబ సభ్యులు తెలిపారు. నరేంద్రకుమార్‌రెడ్డి డాక్టరేట్ పట్టా అందుకోవడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

మన్ననలు పొందితే రాణించవచ్చు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వ్యాపారంలో అందరి మన్ననలు పొందితే రాణించవచ్చని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి

స్థానిక ముద్దనూరు రోడ్డులోని మున్సిపల్ బిల్డింగ్‌లో అనుమల రాజేంద్రప్రసాద్ బుధవారం కమిషనర్‌చే స్నాక్ సిటీ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెస్టారెంట్‌లో నాణ్యత పాటిస్తూ రుచికరంగా ప్రజలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి మలికిరెడ్డి హనుమంతరెడ్డి, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పల్లవోలుకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో గురువారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి భూమిపూజ చేయనున్నట్లు ఎంపిపి బి.లక్ష్మయ్య తెలిపారు. అనంతరం మధ్యాహ్నం లక్ష్మీపేట గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని ఎంపిపి కోరారు.

తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

ప్రజాశక్తి - వేంపల్లె

మోకాలి నొప్పితో ఆపరేషన్ చేయించుకున్న తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డిని వేంపల్లె టిడిపి నాయకులు పరామర్శించారు. బుధవారం కడపలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో బాలస్వామిరెడ్డి మోకాలికి ఆపరేషన్ చేశారు. టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆరవ రమేష్, చక్రాయపేట నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, పాపిరెడ్డి, మహబూబ్ షరీఫ్, యాసీన్ అల్లాబక్షితో పాటు పలువురు టిడిపి నాయకులు పరామర్శించారు.

98 పింఛన్లు తొలగింపు


ప్రజాశక్తి - లింగాల

లింగాల మండలంలో 98 సామాజిక పింఛన్లు తొలగించారు. మండలంలో మొత్తంవృద్ధాప్య, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళలకు సంబంధించి 4,440 పింఛన్లున్నాయి. వీటిలో ఇప్పుడు కొత్తగా 98 పింఛన్లు తొలగించారు. పొలం ఎక్కువ ఉన్నా, పట్టణంలో స్థలాలున్నా, రేషన్ కార్డులో కుటుంబ సభ్యులందరున్నా తదితర కారణాలతో తొలగించారు. దీనిపై ఎంపిడిఒ సుధేంద్రనాథ్‌ను వివరణ కోరగా ఆ 98 పింఛన్లు తొల గించలేదని, వారికి సంబంధించిన ఆధారాలు పరిశీలించనున్నట్లు తెలిపారు.

పులివెందులలో చోరీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక ముద్దనూరు రోడ్డు జయమ్మ కాలనీలో ఉంటున్న వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.



చెల్లా చెదురుగా పడి ఉన్న బీరువాలోని వస్తువులు

జీవనాధారమైన పంచర్ల షాప్‌నకు వెంకటరామిరెడ్డి వెళ్లి బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న వస్తువులను చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. తులం బంగారు గొలుసు, రూ.18 వేల నగదు, రూ.20వేల విలువ చేసే మొబైల్ చోరీకి గురైనట్లు ఆయన పేర్కొన్నారు. బాధితుడి వివరాల మేరకు విచారిస్తున్నామని ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.

ట్యాబ్‌లతో అర్థవంతమైన బోధన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొండాపురం

ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ట్యాబ్‌ల వల్ల వారికి అర్థవంతమైన విద్యాబోధన అలవడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం ఆయన 80మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్‌రెడ్డి, ఎంఇఒ ఓబులేసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కొండాపురం సిఎంఆర్ కాలనీవాసుల నూతన పునరావాస కాలనీలో సిఎస్ఐ చర్చిని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గండికోట ముంపువాసులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించడంతోపాటు ఆయా కాలనీల ప్రజల మనోభావాల మేరకు చర్చిలు, దేవాలయాలు, మసీదుల నిర్మాణం కూడా చేపటట్టం హర్షణీయమన్నారు. కొండాపురం పట్టణంలోని నూతన సచివాలయ భవనాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొండాపురం పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యాలయాలన్ని ఒకేచోట ఏర్పాటు చేశారన్నారు. అనంతరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య సంపద అభివృద్ధికి గండికోట ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలిపెట్టారు. మధ్యాహ్నం 3గంటల నుండి గండ్లూరు, ఓబన్నపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, డిటి రాజేశ్వరి, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, సిఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్, చింతా రాజారెడ్డి, పెద్దిరెడ్డి, తిమ్మాపురం శేఖర్, యంపిపి భర్త రామయ్య, కాంట్రాక్టర్లు వి.రామాంజల్ రెడ్డి నన్నేబాషా, ఏటూరు సూర్య నారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రేగడిపల్లి నాగేశ్వరరెడ్డి, బాలనాగిరెడ్డి, దామోదర్ రెడ్డి, బుజ్జి, మత్స్యశాఖ అధికారులు కెవిఎస్ నాగలింగమాచారి, మద్దిలేటి, కిరణ్‌కుమార్, మల్లీశ్వరి, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపురం : విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని కౌన్సిలర్ అలీ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని రాణివనం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఆయన 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని ఎన్నో మార్పులతో ముందుకు తీసుకెళుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలను అందిస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయులు గోపి మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించి 27 ట్యాబ్‌లు విద్యార్థులకు, 5 ఉపాధ్యాయులకు అందాయని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరిమున్, వైసిపి నాయకులు హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని సర్పంచు జి.రామనాథరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పూర్వ బొమ్మేపల్లి ఎంపియుపి స్కూల్‌లో బుధవారం ప్రధానోపాధ్యాయులు ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా సర్పంచు జి.రామనాథరెడ్డి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఓబులరెడ్డి ట్యాబ్‌లపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి, దేశానికి కాంగ్రెస్ అవసరం



కాంగ్రెస్ జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి, దేశానికి కాంగ్రెస్ పార్టీ అవసరమని మాజీ ఎంపీ డాక్టర్ తులసిరెడ్డి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు బుధవారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 1885 డిసెంబర్ 28న ముంబైలో 72 మంది ప్రతినిధులతో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిందన్నారు. నేడు ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య, లౌకికవాద, సామ్యవాద పార్టీగా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన పార్టీ కాంగ్రెసు అన్నారు. నవ భారత నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన పార్టీ అన్నారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ వంటి గొప్ప నాయకులు నాయకత్వం వహించిన పార్టీగా ఆయన వివరించారు. గాంధీయిజం, లౌకిక వాదం, ప్రజాస్వామ్యం గెలవాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి రావాలని తులసిరెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, సుబ్రమణ్యం, బద్రి, చెన్నకేశవ, నరసింహరెడ్డి, రామకృష్ణ, శివ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సిఎం జగన్ మాట జారడం శోచనీయం

ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాసే, చెప్పే మీడియాపై తిట్ల కార్యక్రమం మొదలు పెట్టడంతోపాటు.. ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి గట్టిగా తిట్టాలని కలెక్టర్లుకు సిఎం జగన్ హితబోధ చేయడం శోచనీయమని మాజీ ఎంపీ డాక్టర్ తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం జగన్ మాట్లాడే మాటలు దిగుజారుడుగా ఉన్నాయన్నారు. ఆయన సిఎం పదవికి అనర్హుడని తులసిరెడ్డి తెలిపారు. రాబోవు రోజుల్లో కొట్టండి అని కూడా చెప్పడంలో సందేహం లేదన్నారు. అవ్వతాతలకు నాడు ముద్దులు.. నేడు గుద్దులు అన్నట్లుంది జగన్ వాలకమని విమర్శించారు. రకరకాల షరతులు పెట్టి లక్షలాది మంది పలు ఫించన్లు రద్దు చేసేందుకు నోటీసులివ్వడం దుర్మార్గమన్నారు. వీరి ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకే ఫించన్ అనే షరతు సమంజసం కాదన్నారు. ఫించన్ కోసం పెట్టిన షరతులు అన్ని తొలగించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పిడిఎస్‌యు నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో పిడిఎస్‌యు నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిడిఎస్‌యు ప్రొద్దుటూరు పట్టణ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. పట్టణ నూతన కమిటీలో ఏకగ్రీవంగా13 మందిని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా పంద్రేస్, పట్టణ కార్యదర్శి రాహుల్, పట్టణ సహాయ కార్యదర్శులు దాదాపీర్, వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షులు విగ్నేష్, కాశి, పట్టణ కోశాధికారి అయ్యప్ప, పట్టణ కార్యవర్గ సభ్యులు రవీంద్రనాథ్, విజయ్, భువనేష్, సూర్యతేజ, ప్రవీణ్, ధనుష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఒ.నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం సరిగ్గా అమలు కావడం లేదన్నారు. విద్యార్థులు క్యారీలు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ అమలు కావడంలేదని, పరిరక్షించే అధికారులు మామూలు తీసుకుం టున్నారన్నారని ఆరోపించారు. పలు సమస్యలపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సేవా కార్యక్రమాలనూ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యతోపాటు సేవా కార్యక్రమాలను కూడా అలవర్చుకోవాలని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజి కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ కోరారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం స్వచ్ఛ భారత్‌లో భాగంగా బుధవారం కరెస్పాండెంట్ ఆధ్వర్యంలో కాలేజి ప్రాంగణాన్ని శుభ్రపరచి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల జీవన నైపుణ్యాలను తెలుసుకుంటారన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రకృతిపైనే ఆధారపడి ఉందన్నారు. మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్స్ వెంకటేశ్వరరెడ్డి, గౌరీశంకర్, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు

మూత్రశాల ఏర్పాటు చేయాలని వినతి



మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక పాత బస్టాండ్ వద్ద ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహం ఏరియాలో అధికారులు పబ్లిక్ మూత్రశాలను ఏర్పాటు చేయాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ కోరారు. ఆ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం శివ నారాయణ మాట్లాడుతూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్‌లో నిత్యం ప్రజలు ప్రయాణం చేస్తుంటారని పేర్కొన్నారు. అవగాహన లేని వ్యక్తులు ఆటో స్టాండ్ వెనకాల మూత్రం పోయడం, పట్టణంలోని టీ, పండ్ల వ్యాపారులు చెత్తను వేస్తున్నారని, దీంతో అక్కడ విపరీతమైన దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు ముద్దనూరు రోడ్డు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ మూత్ర శాల వంటివి ఇక్కడ కూడా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు ఆదాము, నరేంద్ర, అబ్రహం, దివాకర్, మోష పాల్గొన్నారు.

తొలగిస్తున్న పింఛన్లు నిలుపుకో : టిడిపి

ప్రజాశక్తి - వేంపల్లె

నందిపల్లెలో ప్రభుత్వం తొలగిస్తున్న పింఛన్లు నిలుపుకున్న తర్వాత మాట్లాడాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్, ఇలియాస్, ఉపాధ్యక్షులు వీరభద్ర, మహబూబ్ షరీఫ్, గౌస్‌బాబా వైసిపి నాయకుడు శ్రీకాంత్‌ను ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక టిడిపి కార్యా లయంలో బుధవారం వారు విలేక రులతో మాట్లాడుతూ నందిపల్లె గ్రామంలోనే ఆదిమూలం సిద్దయ్య, ఆదిమూలపు ప్రసాద్, పందిళ్లపల్లె ఉత్తమారెడ్డి, సారెడ్డి రామాంజనేయురెడ్డిల ఫించన్లు తొలగించారని పేర్కొన్నారు. నందిపల్లె గ్రామంలో రైతుల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. రుషికొండ కంటే ఘోరంగా నందిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కొండలను తవ్వకాలు చేస్తున్న విషయం మీకు కనపడలేదాని ప్రశ్నించారు. వైఎస్ పాలనలో వేసిన సిమెంటు రోడ్లను చూపిస్తూ అభివృద్ధి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్‌సి కాలనీలో చాలామంది ఫించన్‌కు అర్హత ఉన్నా మంజూరు చేయలేదన్నారు. ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించే అర్హత మీకులేదన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్

ఈ రహదారికి మోక్షమెప్పుడో..!

ప్రజాశక్తి - లింగాల



మండల కేంద్రమైన లింగాల నుంచి పెద్ద కుడాల గ్రామానికి వెళ్లే రహదారికి మోక్షం ఎప్పుడోనని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా పెద్ద కుడాల గ్రామానికి ఈ రహదారి గుండా బండ్లబాట ఏర్పడింది. ప్రస్తుతం ఈ రహదారి పిచ్చి మొక్కలు, కంపచెట్లుతో నిండిపోయి ఉంది. లింగాల గ్రామం నుంచి రైతులు తమ పొలాల వద్దకు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఇక చిన్నపాటి వర్షం పడినా ఈ రోడ్డు నరకం చూపిస్తోందని రైతులు వాపోతున్నారు. గ్రామంలోని చుట్టుపక్కల బండ్లబాటలన్నీ తారు రోడ్డుగా చేస్తున్నారు. ఈ ఒక్క రహదారి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారి బాగు చేస్తే లింగాల నుంచి పెద్ద కుడాల గ్రామానికి కేవలం ఐదు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణం పడుతుంది. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారికి మరమ్మతు చేయాలని కోరుతున్నారు. సమస్యపై ఎంపిడిఒను వివరణ కోరగా ఉపాధి హామీ కింద ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మరమ్మతులు చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని నాగ పట్నం గ్రామానికి మంజూరైన నూతన తారు రోడ్డును బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిచోట పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపణలు చేయడం అసత్యమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిపథంలో పయనిస్తోందన్నారు. ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిటిసి రాముడు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి సిబిఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

రాజంపేట ఎస్ఎపి లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ఎ.తరుణ్ కుమార్ రెడ్డి, పి.నందవర్ధన్ రెడ్డి, జి.ప్రణవి, ఎ.మునీజా, యల్.నాగఅపర్ణ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి

బిసిల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

బిసిల సంక్షేమానికి కృషి చేస్తానని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బడిగింజల చంద్రమౌళి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆర్. కృష్ణయ్య వర్గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళిని నియమించింది. ఆ మేరకు జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లాక వెంగల్‌రావు విజయవాడలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ తనమీద నమ్మకం ఉంచి ఈ భాద్యతలు అప్పజెప్పినందుకు అర్.కృష్ణయ్య, డాక్టర్ వెంగల్‌రావు యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిసిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు గురుమూర్తి యాదవ్, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న బడిగింజల చంద్రమౌళి

సిఐటియు జిల్లా మహాసభలకు తరలిరండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఈనెల 29,30 తేదీల్లో కడపలో నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, కార్మిక లోకం తరలి రావాలని ఆ యూనియన్ పట్టణ నాయకులు దాసు, ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ అద్యక్షులు ఆదాము, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు నాగన్న కార్యదర్శి శేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను హరించే విధానాలను తీసుకొస్తున్నాయని తెలిపారు. జిల్లా 9వ మహాసభలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు, ఆటో, మున్సిపల్ నాయకులు నరేంద్ర, అబ్రహం, శివ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


భారత ప్రభుత్వం నెహ్రు యువకేంద్ర, వికశిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణస్థాయి మహిళా కబడ్డీ పోటీలను అనిబిసెంట్ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం సిఐ నారాయణ, వ్యాయమ అధ్యాపకులు శివారెడ్డి, రాజసింహ, అంకరావు అట్టహాసంగా ప్రారంభించారు. కబడ్డీ పోటీలు కొనసాగిన ఆద్యంతం యువత ఉత్సాహభరితంగా, కేరింతలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణస్థాయిలో యువతకు క్రీడా పోటీల అవకాశం కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వికషిత ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలు, యువ క్రీడాకారిణులు ప్రతి కార్యక్రమంలో ముందు వరుసలో నిలిచి తమ శక్తి సామర్థ్యాలు నిరూపించుకోవాలన్నారు. విన్నర్‌గా ప్రథమ బహుమతి సాధించిన వేంపల్లి జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన ప్రొద్దుటూరు డిఎడబ్ల్యూ కళాశాల జట్టుకు రూ.7 వేలు, తృతీయ బహుమతి సాధించిన వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు రూ.5 వేలు మెడల్స్, సర్టిఫికెట్స్‌ను డాక్టర్లు కాత్యా, నాగార్జున అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురప్ప, ఎన్‌వైకె బృందం రవి, విజయ్, భారతి పాల్గొన్నారు.



ముఖ్యఅతిథులతో గెలుపొందిన జట్లు

రైతుల పరిస్థితి దయనీయం

లింగాల : వైసిపి ప్రభు త్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఎమ్మెల్సీ బిటెక్ రవి పేర్కొన్నారు. మం డలంలోని ఇప్పట్ల గ్రామంలో బుధవారం ఆయన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ధరలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. సామాన్యులు బతకడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలశాఖ టిడిపి అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, పులివెందుల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, రాఘవరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బిటెక్ రవి

ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE AND DEVELOPMENT CORPORATION : KADAPA

Tender Notice No.07/EE/APMSIDC/Div/Kdp/2022-23. dt:28.12.2022

Tenders were invited through 'e' procurement platform for the following works **1)** Standardization of Labour room at CMC Mydukur, YSR District **(Est. Cost :Rs.8.20 Lakhs, 2)** Standardization of Labour room at CHC Badvel, YSR District **(Est. Cost : Rs.8.50 Lakhs).**

Tender Schedules to be uploaded in www.apeprocurement.gov.in on **31.12.2022** For any other information and clarification, please contact the Executive Engineer, APMSIDC Division office, New RIMS Campus, Kadapa in office working hours.Ph.No.0852-225632.

EE/APMICDC/DIV/KDP



జిల్లా ఆస్పత్రిలో ఖాళీల భర్తీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. బుధవారం జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనాలో కోవిడ్-19 విజృంభిస్తున్న నేపథ్యంలో కేసులు పెరిగితే ముందస్తు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రిపరేటరీ వర్కులని పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఆక్సిజన్ సిలిండర్లు, ఎల్ఎంఒలు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, అన్ని బాగా పనిచేస్తున్నాయా లేదా చెక్ చేయాలన్నారు. 15 లక్షల సిఎస్ఆర్ ఫండ్స్ కింద ఎక్స్రే మిషన్ వచ్చే వారంలోగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. చుట్టుపక్కల డ్రైనేజీ సమస్య ఉందని చెప్పారని, ఇదివరకే మున్సిపాలిటీ అధికారులు డ్రైనేజ్ పనిని స్టార్ట్ చేశారన్నారు. వర్షాలు వస్తే లీకేజీలు అవుతున్నాయని, ఇందుకోసం రూ.25 లక్షలు మంజూరు చేశామన్నారు. అన్ని పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని డాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవలను గణనీయంగా పెంచాలన్నారు. గత మీటింగ్ సంబంధించి అజెండాతో పాటు పలు అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు.



ఏదీ 'పింఛన్'

- వేలాది మందికి నోటీసులు జారీతోవిలవిల
- తమ జీవనమెలా అంటూ ఆవేదన
- పునఃపరిశీలన జాబితాలో వేలాది మంది
- తాఖీదులు వచ్చిన వారికి జనవరిలో కష్టమే

కన్నవారి ఆదరణ కరువై, కట్టుకున్న వారి తోడుకు దూరమై ఫించన్ మీదే ఆధారపడి బతుకుతున్న వారు ఎందరో అలాంటి వృద్ధులు, వితంతువులు, విభిన్నప్రతిభావంతుల పింఛన్లను తొలగిస్తూ వారి గుండెకోతకు కారణమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి నుంచి కొత్త పింఛన్లు ఇస్తామని గొప్పలు చెప్పిన వైసిపి ప్రభుత్వం లేనిపోనిసాకులతో పింఛన్లు తీసివేయడంపై నిరుపేదలు లబోదిబోమంటున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 2,43,315 మంది, అన్నమయ్య జిల్లాలో 2,15,552 మంది వైఎస్ఆర్ పింఛను తీసుకుంటున్నారు. ఉభయ జిల్లాల్లో వేలాది మందికి అనర్హత పేరిట నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 30 వేల మందికి సచివాలయాల వారీగా అధికారులు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా ఆధారాలు నిరూపించుకోకపోతే జనవరి నెల నుంచి వారికి పింఛను అందదు. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు విలవిల్లాడిపోతున్నారు. - ప్రజాశక్తి-యంత్రాంగం

పింఛను తొలగించడం అన్యాయం



ఆకస్మికంగా పింఛను తొలగించడం అన్యాయం. 11 ఏళ్ల నుంచి వికలాంగుల పింఛను వస్తోంది. రూ.3 వేలు ఇస్తుడడంతో సంతోషంగా ఉండేది. రెండు రోజుల క్రితం వాలంటీర్ వచ్చి పింఛను రద్దయిందని చెప్పారు. నా సోదరుని రేషన్‌కార్డులో నా పేరు ఉంది. అన్నకు కారు ఉందనే కారణంతో నాకు వస్తున్న పింఛను రద్దు చేశారు. పింఛను లేకపోతే ఇబ్బందిగా ఉంటుంది. సచివాలయం వద్దకు వెళ్లితే రేషన్ కార్డులో పేరు మార్చుకోవాలని చెప్పారు.

- ఎం.రవికుమార్‌రెడ్డి, విభిన్నప్రతిభావంతుడు, వేంపల్లె.

బిల్లు అధికంగా వచ్చిందని...



విద్యుత్ బిల్లు మూడు వందల యూనిట్లకుపైగా వస్తోందని పింఛను రద్దు చేస్తున్నట్లు వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. వయసు మీద పడి ఒక కాలు పూర్తిగా లేకపోవడంతో ఎలాంటి జీవనాధారం లేదు. ప్రభుత్వం నుంచి వస్తున్న పెన్షన్ సహాయం కూడా అందకపోతే జీవనాధారం కష్టతరమవుతుంది. పదేళ్ల కిందట నాతో వేరుపడిన కుమారుడిపై ఉన్న ఇంటిపై వస్తున్న కరెంటు బిల్లును నా పేరును చూపిస్తున్నారు. **- మల్కిగారి ఇబ్రహీం, చాపాడు.**

అధిక ఇంటి స్థలం ఉన్నట్లు నోటీసు



మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి చదరపు అడుగు లకుపైగా ఇంటి స్థలం ఉందని పెన్షన్ తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పాతపాలెంలో నివాసం ఉన్న ఇంటితో పాటు పశువుల పాకకు సంబంధించిన స్థలం ఉంది. పెన్షన్ తొలగింపు నిర్ణయం సరికాదు.

- జి.ఓబులరెడ్డి, మైదుకూరు.

పింఛను కొనసాగించాలి



తన భర్త చనిపోవడంతో ఆరేళ్లుగా తనకు వితంతు పింఛను వస్తోంది. తన పేరుతో ఇళు ఉందని నోటీస్ ఇచ్చారు. తనకు ఇప్పుడు పెన్షన్ తొలిగిస్తే నేను ఎలా జీవించాలి. తన వయసు 65 సంవత్సరాలు. తనకు జీవనాధార లేదు అధికారులు స్పందించి తనకు వస్తున్న పెన్షన్ కొనసాగించాలి.

- సి.హుసేన్‌బీ, కొత్తపేట, రాయచోటి.

15 ఏళ్లుగా పింఛను వస్తోంది



తనకు 15 ఏళ్లగా వికలాంగుల పెన్షన్ వస్తోంది. సదరంలో డాక్టర్లు, ముగ్గురు కమిటీ నెంబర్లు ఆధ్వర్యంలో వికలాంగులని నిర్ధారణ చేసి తనకు పింఛను మంజూరు చేశారు. తన ఆధార్ నెంబర్‌కు రాయచోటి పట్టణానికి చెందిన తిరుపతి చిన్న రెడ్డప్పకు చెందిన ఆస్తులను జమ చేశారనే సాకుతో సచివాలయ అధికారులు నోటీసులు ఇచ్చారు. మున్సిపల్ అధికారులను కలవగా స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌ను కలవమని చెబుతున్నారు. తాను తిరుపతి చిన్న రెడ్డప్ప కోసం పట్టణమంతా వెదుకుతున్నాను. ఇంత వరకు ఆయన ఆచూకీ కనిపించడం లేదు. అధికారులు స్పందించి తనకు పింఛనును కొనసాగించాలి.

- బుక్కే శివకుమార్, విభిన్నప్రతిభావంతుడు, రాయచోటి.

ఇంటి స్థలముందని తొలగించారు



గతంలో తన కుమారుడికి ప్రభుత్వం డికెటి ఇంటి పట్టా ఇచ్చింది. దానిని పూట గడవక అమ్ముకున్నాం. తాముండే ఇళ్లు కూడా డికెటి స్థలం. పింఛను ఎందుకు రద్దు చేశారని అడిగితే ఇంటి స్థలం ఎక్కువ ఉందని పోయిందంటున్నారు. 500 అడుగుల స్థలం మాత్రమే ఉంది. తాము అమ్ముకున్న స్థలంను తీసివేయమని అధికారులను అడుగుతుంటే ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు.

- రహిమాన్ మహబూబి, వృద్ధురాలు, జమ్మలమడుగు.

పింఛను ఇప్పించండి



గతంలో ఎప్పుడు లేని విధంగా ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్ లేదని పింఛను ఇవ్వడం లేదు. అన్ని అర్హతలు ఉన్నా పెన్షన్ రాకపోవడంతో జీవనం దుర్భరంగా మారింది. పెన్షన్‌కు దరఖాస్తు చేసుకొన్నా ఇంకా పెన్షన్ రాలేదు. అధికారులు చొరవ చూపి పెన్షన్ ఇప్పించాలి.

- సయ్యద్‌బాషా, కలికిరి.

మూన్నెళ్లుగా పింఛను ఇవ్వలేదు



పింఛనుకు దరఖాస్తు చేసి మూడు నెలలు కావస్తున్నా ఇంకా రాలేదు. జీవితం దుర్భరంగా మారి బిక్షాటన చేస్తున్నా. అధికారులు త్వరతిగతిన పెన్షన్ మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను.

- నరసమ్మ, సిటిఎం, మదనపల్లి.

భూమి ఉందని నోటీసు ఇచ్చారు



పింఛను నిలుపుదలపై నాకు నోటీసు అందజేశారు. నాకు 1.44 ఎకరాలుంది. నా పేరుపై వెబ్ ల్యాండ్‌లో మూడు ఎకరాల మాగాని, 20 ఎకరాల మెట్ట పొలం ఉందని కారణంతో పెన్షన్ తొలగింపుపై నోటీసు అందజేశారు. నాకు అంత పొలం లేదు. తహసిల్దార్ కార్యాలయానికి వెళ్ళి వినతి పత్రాన్ని కూడా అందజేశాను. నాకు పెన్షన్ పునరుద్ధరించాలని కోరుకుంటున్నా.

- సవరం పాపులమ్మ, పోరుమామిళ్ల.

పింఛను పునరుద్ధరించాలి



నాకు ఎలాంటి ఆస్థి లేదు. అధిక కరెంటు బిల్లు కూడా రాలేదు. అయినా నా పింఛను తొలగించారు. ప్రభుత్వం అందించే సామాజిక పింఛను పైనే జీవనం కొనసాగిస్తున్నాను. దయచేసి తొలగించిన పింఛను పునరుద్ధరించాలి.

- బి.సునీల్ కుమార్, విభిన్న ప్రతిభావంతుడు, రాజంపేట.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రామసముద్రం

జగనన్న ఇళ్ల నిర్మానాలకు నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం మండలంలోని కాప్పల్లి, చెంబకూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఎ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తి చేశారు, ఆర్ఎల్ స్టేజీలో ఉన్నవి ఆర్‌సికి తీసుకురావాలని, ఆర్‌సి స్టేజ్‌లో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. కాప్పల్లి సచివాలయం పరిధిలో 152 ఇళ్లు మంజూరు కాగా 51 పూర్తయ్యాయనీ, బిఎల్ 24, బిబిఎల్ 29, ఆర్ఎల్ దశలో 22 ఉన్నాయన్నారు. రామసముద్రం మండలంలో 25 శాతం ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని, త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉండాల్సిన వయస్సుకు తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న చిన్నారులపై పర్యవేక్షణ చేయాలని మహిళా పోలీస్, ఎఎన్ఎంను ఆదేశించారు. సచివాలయం పరిధిలో ఎంత మంది గర్భిణిలు ఉన్నారు, ఎంత మంది రక్తహీనతతో బాధపడుతున్నారు వంటి వివరాలను ఎఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల్లో రక్తహీనతను దూరం చేయడానికి పోషకాహారమైన భోజనం తీసుకునేలా మరింత అవగాహన కల్పించాలన్నారు. చెంబకూరు గ్రామ సచివాలయంలో ఆర్ఎల్ 53 ఇళ్లు ఉన్నాయని వాటిని ఆర్‌సికి తీసుకురావాలని ఇంజినీర్ అసిస్టెంట్‌కు సూచించారు. 66 బిబిఎల్‌లో ఉన్న ఇళ్లను బిఎల్‌కు తీసుకురావాలన్నారు. రెవెన్యూ సమస్యలపై మాట్లాడుతూ విఆర్ఒ మ్యుటేషన్ సరిగా చేస్తున్నారా లేదా అనే విషయాలను గ్రామస్తులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో బరువు తక్కువగా, ఎత్తు పెరగకపోవడం ఉన్న వారిని డాక్టర్ వద్ద రెగ్యులర్‌గా చెకప్ చేయించి బరువు, ఎత్తు పెరిగే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. పింఛన్ల వెరిఫికేషన్ సాయంత్రంలోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సచివాలయంలో సేవలు బాగా అందిస్తున్నారా లేదా వంటి వివరాలను కలెక్టర్ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించి 30 శాతం పెండింగ్ ఉందని, పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డ్ ఇస్తున్నామని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు తరచూ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన రుచిని చూడాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే తప్పనిసరిగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. సచివాలయం ద్వారా రోజులో వీలైనన్ని ఎక్కువ సర్వీసు లను సకాలంలో అందించాలన్నారు. మండల పరిధిలో అసంపూర్తిగా నిలిచి పోయిన సచివాలయ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికా రులకు ఆదేశించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ లక్ష్మీపతి, ఎంపిడిఒ సురేష్ బాబు, తహశీల్దార్ విశ్వేశ్వర శాస్త్రి, ఇఒపిఆర్‌డి చలపతి రావు, ఎఒ మోహన్ కుమార్, ఎంఇఒ హేమలత, ఎపిఒ గౌరీ శంకర్, ఎపిఎం సుబ్రమణ్యం, సర్పంచ్ నారాయణమ్మ, రమణమ్మ, కన్వీనర్ భాస్కర్ గౌడ్, వైస్ ఎంపిపి రమణారెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

మదనపల్లె అర్బన్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహాలను మంజూరు చేసిందని, జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులు ముమ్మరంగా జరగాలని అధికారులను కలెక్టర్ గిరీష్ ఆదేశించారు. బుధవారం మదనపల్లె సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో మదనపల్లి అర్బన్, రూరల్ పరిధిలో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఉపాధి హామీ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, విఆర్ఒలు, హౌసింగ్ ఇంజనీర్లు, తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, పేద వారి ఇంటి కల నెరవేరేలా అధికారులు అందరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ మురళి పాల్గొన్నారు.

భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న భూ ఆక్రమణలను నిగ్గు తేల్చాలని, అందుకోసం జిల్లా జడ్జి పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్, ఎస్‌పి సంయుక్తంగా విచారణ చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కల్యాణ మండపంలో సిపిఎం ఆధ్వర్యంలో "పభుత్వ భూములను కాపాడుకుందాం.. జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసుకుందాం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి రాయచోటి కేంద్రంగా భూ కబ్జాలు ఎక్కువ అయ్యాయన్నారు. అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి రికార్డులను తారుమారు చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మాసాపేట గ్రామ సర్వే నెంబర్ 971లో మొత్తం 84 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే అందులో 70 ఎకరాలు కలెక్టర్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించగా మిగిలిన ప్రభుత్వ భూములను అధికారులు ప్రమేయం లేకుండానే కాజేశారా అని ప్రశ్నించారు. రామాపురం మండలం చిట్లూరు దళితవాడ శ్మశాన భూమి, చెన్నముక్కపల్లిలో దళితుల ఈనాం భూమి, సంబేపల్లి మండలంలో దుద్యాల దళితుల అనుభవంలో ఉన్న భూములు అధికార పార్టీ నాయకులు, అధికారులను అడ్డం పెట్టుకొని కాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దుమారం రేగిన తర్వాత కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటే సరిపోదని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాయచోటి కేంద్రంగా జరిగిన భూ కబ్జాలపై ఎమ్మెల్యే స్పందించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కుర్చీలోనే కూర్చొని మాట్లాడిన తీరు చూస్తేనే శాసనసభ్యులు ఆయన్ను ఎంత ఒత్తిడికి గురి చేస్తున్నారని అర్థం అవుతుందన్నారు. భూ కబ్జాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన చెబితే సరిపోదని, భూ కబ్జాలకు పాల్పడిన వారిని శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. జిల్లాలో భూ బాధితులను సమీకరించి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పౌర హక్కుల సంఘం నాయకులు టి.ఈశ్వరయ్య, భారత నాస్తిక సమాజం నాయకులు పి.తాతయ్య, మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఎస్.సగీర్, బిఎస్‌పి జిల్లా నాయకులు యుగంధర్, విద్యావంతుల వేదిక నాయకులు చల్లా రెడ్డెయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు కెనాగబసిరెడ్డి, నాయకులు ఆఫ్తాద్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా భూ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి కన్వీనర్‌గా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో భూ కబ్జాలపై జిల్లా జడ్జి పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్, ఎస్‌పి సంయుక్తంగా విచారణ చేపట్టాలని, కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌జెడి తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.బాబు బుధవారం రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనికీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తమ్ ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఆయన కళాశాలలోని పలు విభాగాలను సందర్శించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు ఇచ్చారు. పిదప బొటానికల్ గార్డెన్‌ను, వర్మీ కంపోస్టును పరిశీలించారు. అనంతరం గార్డెన్‌లో మొక్క నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది ఎన్.హెచ్. హనుమంతరావు, పీడీ మేజర్ విజయ భాస్కర్, వి.పార్వతి, ఎస్.భాస్కర్ రావు, బి.నాగేష్ బాబు, శివపార్వతి పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేయడమే నాయకుడి లక్షణం

ప్రజాశక్తి - రాయచోటి

పార్టీ కోసం పని చేయడమే నాయకుని లక్షణమని కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.అల్లాబకాష్ అన్నారు. బుధవారం జాతీయ కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. అందులో భాగంగా నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1885వ సంవత్సరంలో డిసెంబర్ 28న జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించడం జరిగిందిన్నారు. భారత దేశ స్వాతంత్ర పోరాటానికై ఆవిర్భవించి స్వాతంత్ర సంగ్రామంలో కుల మతాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ఉద్యమాలలో ప్రజలను భాగస్వామ్యం చేసి దేశానికి స్వాతంత్రం సాధించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందిన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ ఎస్ఎండి గౌస్, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ జఫరుల్లా, ఇర్ఫాన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన 'చమర్తి'



అచ్చెన్నాయుడుతో చమర్తి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బుధవారం విజయవాడలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడును టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం రాజంపేట నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితి గురించిన సమాచారాన్ని అచ్చెన్నాయుడు ఆరా తీశారని, వారి మధ్య పలు సంభాషణలు జరిగినట్లు చమర్తి తెలిపారు. రాజంపేట నియోజకవర్గ పార్టీ అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు అచ్చెన్నాయుడు తెలిపినట్లు జగన్మోహన్ రాజు తెలియజేశారు.

దళితవాడకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించండి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న దళితులు

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యుత్ బకాయిలు చెల్లించి తీరాల్సిందేనంటూ విద్యుత్ అధికారులు 60 మంది బకాయిలు ఉండగా రూ.4 నుంచి రూ.8 వేలు వరకు ఉన్నా నిర్లాక్షణ్యంగా ఏడుగురు దళితుల కనెక్షన్లను కట్ చేశారు. బకాయిలు చెల్లిస్తేనే విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరిస్తామని చెప్పడంతో తమవల్ల కాదంటూ రహదారిపై నిలబడి ఆవేదన తెలిపారు. ఈ ఘటన మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్ద హరిజనవాడలో చోటు చేసుకుంది. 2019 జూన్ నుంచి విద్యుత్ బకాయిలు చెల్లించలేదని విద్యుత్ అధికారులు పెద్ద మాదిగపల్లె ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను కట్‌చేశారు. వీరంతా కూలి చేసుకుంటూ జీవనాధారంగా బతుకుతున్న నిరుపేదలు. వారి పేరుతో విద్యుత్ బకాయిలు ఉన్నాయని, ప్రతి నెలా విద్యుత్ అధికారుల దళిత వాడికి వచ్చి విద్యుత్ బకాయిలు చెల్లించాలని చెప్పున్నా పట్టించుకోలేదని విద్యుత్ అధికారుల వాదన. తాము వాడుతున్నది ఓ ఫ్యాన్, ఓ బల్బు అయితే వేలకు వేలు బకాయిలు ఎలా ఉంటాయని, గత ప్రభుత్వ హయాంలో ఉచితంగా కరెంట్ ఇస్తామని చెప్పారని దళితులు వాపోయారు. గత ప్రభుత్వం దళితులకు 150 యూనిట్లు ఉచితంగా విద్యుత్‌ను అందించిందన్నారు. పాత బకాయిల పేరుతో దళితులను వేధించడం సరికాదన్నారు. రెండేళ్లుగా కరోనా నేపథ్యంలో కుటుంబం గడవడమే కష్టంగా ఉంటే, ఇపుడు బకాయిల పేరుతో కరెంట్ కనెక్షన్ తొలగించడం అన్యాయమన్నారు.కరెంటు బిల్లు చెల్లించని వారి కరెంట్ కట్ చేసి కక్ష సాధిస్తోందన్నారు. వేలకు వేలు డబ్బులు ఎక్కడినుంచి కట్టాలి మేము నిరుపేదలము పాలకులు మాకు న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ నాగులయ్య దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులను వివరణ అడుగగా ఎస్సీల విద్యుత్ సబ్సిడీ పథకం ఇచ్చిన 200 యూనిట్లు లోపల కరెంటు వాడుకోవాలన్నారు. 200 యూనిట్లు వాడుకున్న వారు కరెంటు బిల్లులు చెల్లించాల్సిందేనిని అధికారులు చెబుతున్నారు. 200 యూనిట్లు దాటితే ప్రభుత్వ సబ్సిడీ రాదన్నారు. మీటర్ కనెక్షన్ అప్లికేషన్ తీసుకోవాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. కనెక్షన్ అప్లికేషన్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తీసుకొని సచివాలయంలో అప్లై చేసుకుంటే మీటర్ కనెక్షన్ ఒక్కరోజులోనే ఇస్తామన్నారు.

పథకాల అమలులో వాలంటీర్లే కీలకం : 'గడికోట'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అమలుపరిచే బాధ్యత బూత్ కమిటీ కన్వీనర్లు, వాలంటీర్లు దేనని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ కన్వీనర్లు, వాలంటీర్లు, పార్టీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. వ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన పెన్షన్ రూ.2750 విషయం పింఛను దారులకు తెలియజేయాలన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని దాదాపు అమలు చేస్తూ వస్తున్నారన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి వాలంటీర్ కింద ఇద్దరు గృహ సారధులు ఉంటారని, బూత్ కమిటీ కన్వీనర్లు గృహసారధులను కలుపుకొని ప్రతి ఇంటికీ చేరువవుతున్నా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల మాజీ మండల అధ్యక్షులు పార్టీ కన్వీనర్ జి.జనార్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విశ్వనాథరెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, వైసిపి నాయకులు సూరం వెంకటసుబ్బారెడ్డి, రాయచోటి నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ల అబ్జర్వర్ కరీముల్లా, ఉప ఎంపిపి రవిశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, బూత్ కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి : ఎంపిపి

ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఎంపిపి సీతమ్మ ఆదేశించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో యూరియా కొరతపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ నెల 19వ తేదీన 'యూరియా కృత్రిక కొరత', 28న 'యూరియా కోసం అష్టకష్టాలు' అనే శీర్షికలతో ప్రజాశక్తిలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై స్పందించిన ఎంపిపి యూరియా కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. యూరియా మండలంలో లేకపోవడానికి ఏంటని సభ్యులు వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. స్పందించిన వ్యవసాయాధికారి పది రోజుల్లో మండలంలో యూరియా కొరత లేకుండా చూస్తామని సమాధానమిచ్చారు. సుమారు 400 మంది విద్యార్థులకు కేవలం ఒక స్పెషల్ బస్సు నడుపుతున్నారని, రాయచోటి బస్సులు విద్యార్థులను ఎక్కించుకొనడం లేదని, మరో బస్సు ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. డిపో మేనేజర్‌కు రాతపూర్వకంగా లెటర్ రాసి బస్సు వచ్చేలా చూడాలని కోరారు. ఉద్యానవన, రెవెన్యూ, హౌసింగ్, ఉపాధి, ఇతర శాఖలపైన సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి చాలామంది ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ ఖాజాబీ, వైస్ ఎంపిపి కరుణాకర్, ఆర్‌బికె చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగల్ విండో చైర్మన్ శివారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్



నియామకపత్రం అందుకుంటున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా గట్టు చంద్రశేఖర్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చంద్రశేఖర్ నాయుడుకి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా బిసిల సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తానన్నారు. క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి బిసిలను సమైక్యం చేస్తానన్నారు. తనకు ఈ పదవిని అప్పగించిన జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, సహకరించిన ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. వారు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి నాయకులు బెల్లె రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-నందలూరు

విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్ల తిమ్మయ్య గారిపల్లి సర్పంచ్ గీతాల శిరీషనరసింహారెడ్డి తెలిపారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొత్తతిమ్మ రాచపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పైరీత్రం, కిరోసిన్ ద్రావణాన్ని పిచకారి చేయిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత వాతా వరణ పరిస్థితుల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని అన్నారు. గ్రామ ప్రజలు అప్ర మత్తంగా ఉంటూ కాచి చల్లారిన నీటిని తాగాలని సూచించారు. ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భ్రమ రాంబదేవి, వైద్యసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ జట్టుకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న జి.పల్లవి అండర్-17 జాతీయ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్ తెలిపారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారుల్లో పల్లవి ఆల్‌రౌండ్ ప్రతిభతో జాతీయజట్టుకు ఎంపికైందని వారు పేర్కొన్నారు. త్వరలో జరగబోయే పోటీలలో రాష్ట్రం తరుపున పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ చదు వుతోపాటు క్రీడల్లో కూడా ప్రతి ఒక్కరూ రాణించాలని అన్నారు. మహిళలు క్రీడల్లో రాణించడం ఆనందిం చాల్సిన విషయమని జాతీయజట్టుకు ఎంపి కైన పల్లవి కూడా ప్రతిభ చాటి పాఠశాలకు, జిల్లాకు మండలానికి, తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. పాఠశాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీస్తూ వారికి శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్‌ను అభినందించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-కలికిరి

ముస్లిం మైనార్టీ జెఎసి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మైనార్టీ జెఎసి వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ హనీఫ్ కు టిడిపి రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా పదవి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ జెఎసి సభ్యులు మాట్లాడుతూ కులమతాలకతీతంగా ఐకమత్యం, సోదర భావంతో కలిసిమెలిసి ఉన్నామన్న భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీ వ్యవస్థాపకులు హనీఫ్ మాట్లాడుతూ ప్రజ 'సేవే లక్ష్యంగా కరోనా సమయంలోనూ కుల మతాలకతీతంగా కరోనా మృతులకు దహన సంస్కారాలు చేశామని అదేవిధంగా కష్టాల్లో ఉన్నవారికి ఆర్థికంగానూ, తమ సహాయ సహకారాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ జెఎసి సభ్యులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లి : మండలంలోని ముక్కావారిపల్లిపంచాయతీ పరిధిలోని తురకపల్లి గ్రామంలో నివాసమున్న సద్దాం కుమారుడు రియాజ్ డెంగీ జ్వరంతో కోడూరులోని ఓ ప్రయివేటు హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ముక్కా సాయికిరణ్ రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముక్కా వర్గనిరెడ్డి మాట్లాడి, బాలుడి తల్లిదండ్రులకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచ ఆరవ శ్రీధర్, బాలుని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన

కురబలకోట : ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ మంజునాథ్ బాబు అన్నారు. అంబేద్కర్ సేన (బాస్) ఏన్నెండవ ఉచిత గుండె వైద్య శిబిరం గురువారం అంగళ్లులోని ఆర్‌ఆర్‌ఏస్ సంస్థ కార్యాలయంలో విజయవంతంగా జరిగిందని అన్నారు. నారాయణ హృదయాలయ వైద్యులచే, సిజెని లైఫ్ రాజు మైకా తోకలిసి భారతీయ అంబేద్కర్ సేన ఈ వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ హృదయాలయకు చెందిన కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మంజునాథ్‌బాబు, క్లినికల్ కార్డియాలజిస్టు డాక్టర్ కిరణ్‌కుమార్ ఉపర్యవేక్షణలో వైద్యపరీక్షలు చేశారు. వైద్య శిబిరం నందు 186 మందికి స్క్రీనింగ్ చేశారు. ఇసిజి, 2డి ఎకో, బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా అందించారు. 11 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ కావడంతో వారిని, కోలార్ లోని నారాయణ హార్ట్ సెంటర్ కు రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్య శిబిరం సమన్వయకర్త నరేష్, టెక్నీషియన్ మనోజ్, ఇందిరా ప్రియదర్శిని, బాస్ జిల్లా కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ కేంద్ర కమిటీ సభ్యులు బురుజు లక్ష్మీనారాయణ, కె.వి.రమణ, ముత్యాల మోహన్ స్థానికకాపాలకులు ఎరుకల్లు, బండి సుధాకర్, వడ్డె శ్రీరాములు, చిన్న, సూరి, గోపాలకృష్ణ, మోహన, సిజెని లైఫ్ సభ్యులు జోన్, జాన్సన్ లతోపాటు బాలాజీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థి విరాళం

పెద్దమండ్యం: మండలం లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 20 వేల రూపాయలు విరాళాన్ని రాయచోటి రవీంద్ర అందించారు. రవీంద్ర మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదవతరగతి చదివానని, మాబ్యాచ్‌లో చదివినవారు అనేక రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నామని అన్నారు. నావంతుగా రూ.20,000 నేను చదివిన పాఠశాలకు విరాళాన్ని అందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యా యులు రామకృష్ణ, ఉపాధ్యాయబృందం, రవీంద్ర, శ్రీరాములు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే యంత్రాలను తయారు చేయండి

కురబలకోట : రైతులకు ఉపయోగపడే యంత్రాలను తయారు చేయాలని మిట్స్ కళాశాల విద్యార్థులకుమహిళా అభివృద్ధి సొసైటీ పిడి ఎస్.వినాయక రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మిట్స్ కళాశాలను మెకానికల్ ఇంజినీరింగ్ విభాగము వారు రైతులకోసం తయారు చేసిన యంత్రాలను ఆయన సందర్శించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ముష్ఠ లక్ష్మణరావు ఆధ్వర్యంలో క్రాఫ్ ప్రొటెక్షన్ యంత్రాన్ని, కలప పరికరాన్ని, వరి నూర్పిడి యంత్రాన్ని, కోల్డ్ స్టోరేజ్ పరికరాన్ని, ధాన్యం ను మట్టిని వేరుచేసే యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, డీన్ డాక్టర్ తులసి రామ్‌నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డిఇఒ రాఘవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పునాది వంటిదన్నారు. లక్ష్య సాధన కోసం పట్టుదల, అంకితభావంతో బాగా చదవాలన్నారు. పరీక్షలలో చూచిరాతలకు ఉండవని, అత్యంత పగడ్బందీగా నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రథమ స్థానంలో ఉండేందుకు ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్లు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. నూతన ప్రశ్నాపత్రం పై ప్రతి విద్యార్థికి అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివిలో ఆకస్మిక తనిఖీ

రామాపురం: మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలను బుధవారం అన్నమయ్య జిల్లా డిఇఒ రాఘవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికలను, 8వ తరగతి బాలికలకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్ వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మార్చిలో నిర్వహించబోయే 10, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కెజిబివి ప్రత్యేక అధికారిణి పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి డిపిఆర్‌లు సిద్ధం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణంలో 25 ఎకరాలలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్టేడియం నిర్మాణ నిమిత్తం డిపిఆర్‌లు సిద్ధమయ్యాయి. సదరు డిపిఆర్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి సెప్ సిఇఒ సాయి అందజేశారు. డిపిఆర్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతి స్టేడియం నిర్మాణ పనులను మొదలుపెడతామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు ఫయాజ్ బాష, ఫయాజూర్ రెహమాన్, కాంట్రాక్టర్ రియాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - బి.కొత్తకోట



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరిష

మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్‌లో టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొండపై కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు హైమాస్ట్ లైట్లను కలెక్టర్ గిరీషా లాంఛనంగా ప్రారంభించారు.పర్యాటకుల సౌకర్యార్థం రద్దీగా ఉండే రెండు ప్రదేశాలలో ఐదు రూపాయల నాణేంను బాక్స్ లో వేస్తే ఒక లీటర్ మంచి నీరు వచ్చే యంత్రాన్ని ఆయన పారంభించారు. శ్రీఏనుగు మల్లమ్మ దేవస్థానంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు .భవిష్యత్తులో దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా హార్సిలీహిల్స్ అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. కలెక్టర్ వెంట మదనపల్లి ఆర్‌డిఒ మురళి, టౌన్ షిప్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గడప గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన లక్కిరెడ్డిపల్లె మండలంలోని లక్కిరెడ్డిపల్లె 1,2 సచివాలయాల పరిధిలో ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డెయ్యలతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జి.జి.రాచపల్లె ,ప్రభుత్వ ఆస్పత్రి, పాతకోర్టువీధి రామాపురం మెయిన్ రోడ్డు, పాత పోస్ట్ ఆఫీసు వీధి, రామాలయం వీధి , ఓల్డ్ మసీదు వీధి, లాలా వీధి, హనుమాన్ వీధి, కొత్తకొట్టాల వీధులలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటి పర్యటన చేపట్టారు. ఇచ్చిన నోటీసులు కేవలం విచారణ కోసమేనన్నారు. జనవరి నుంచి పెంచిన పెన్షన్ రూ.2750 అంద నుందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగప్రసన్న లక్ష్మి, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వ నాథరెడ్డి, వైస్ ఎంపిపి సమరసింహారెడ్డి , గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్‌అమీర్, ఉపసర్పంచ్ రాజారెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ విజయభాస్కర్, ఎంపిటిసి సభ్యులు దస్తగిరి, శంకర్ నాయుడు, సర్పంచులు వెంకటనారాయణరెడ్డి, జనార్ధన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రైల్వే కోడూరు రూరల్** :పట్టణంలోని 3వ సచివాలయపరిధిలో 8 వార్డులో నిర్వహిం చిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల నుంచి వస్తున్న వినతులను అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్క రించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధ్వజ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, జెడ్పిటిసి రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లాటూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, తహశీల్దార్ రామ్మోహన్, ఎంపిడిఒ నాగార్జున, పట్టణ కన్వీనర్ రమేష్, సర్పంచులు శివయ్య, చంద్రశేఖర్, ఎంపిటిసిలు, సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం : టిడిపి

ప్రజాశక్తి-నందలూరు

వైసిపి అరాచకపాలనకు చరమగీతం పాడేరోజులు దగ్గర పడ్డాయని టిడిపి మండల అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బత్యాల చెంగల్‌రాయుడు సూచన మేరకు ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చింతకాయపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో కనీసం పండగలు కూడా జరుపుకునే పరిస్థితి లేదన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న ప్పుడు క్రిస్మస్‌కానుక, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా లాంటి పథ కాలు అందించారని అన్నారు. జగన్ అధికారంలోకి రాగానే ఆ పథకాలన్నీ రదు చేసి నిరుపేదల కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కారణాలు పెట్టి సంక్షేమ పథకాలకు కోతలు కోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వికలాంగులు, వృద్ధులు, వితంతు వులకు అనేక కారణాలు పెట్టి పెన్షన్లు తొలగించారని అన్నారు.కార్యక్రమంలో బిసి సెల్ పార్లమెంట్ కార్య నిర్వహణ కార్యదర్శి చుక్క యానాది, మదన మోహనాపురం గ్రామ అధ్యక్షులు ప్రసాద్, ఉపసర్పంచ్ పెంచలయ్య, మండల ప్రధాన కార్యదర్శి గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, మండల ఉపాధ్యక్షులు బి.నరసయ్య , నందలూరు సర్పంచ్ మోడపోతుల రాము, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి శివ, గుండు సురేష్, నరసయ్య, కొండయ్య, నాగార్జున, గౌస్ బెగ్, బుశెట్టి కిరణ్, వెంకటేష్, శ్రీను, చంద్ర, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట** : మాజీ ఎమ్మెల్యే, తంబళ్లపల్లి నియోజకవర్గం టిడిపి ఇంచార్జి జి.శంకర్‌యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీలో బుధవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నియోజవర్గం పరిశీలికుడు కుడుము శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు నారాయణస్వామి రెడ్డి, జిల్లా నాయకుడు సుకుమార్, రాష్ట్రనాయకులు మస్తాన్, మాజీ ప్రభుత్వఆస్పత్రి కమిటీ సభ్యుడు కనకంటి ప్రసాద్, షమీవుల్లా పాల్గొన్నారు.

'ఉన్నత చదువులకు బాటలు వేసుకోవాలి'



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని జిహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాల, బాలికోన్నత పాఠశాల, జడ్పిహెచ్ఎస్, ఎంజెపి గురుకుల పాఠశాల, ఎంపియుపిఎస్ గుట్టపాలెం, ఎంపియుపిఎస్ ఎల్లం పల్లి పాఠశాల నుండి 8వ తరగతి విద్యార్థులకు 379 ట్యాబ్‌లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంఇఒ రంగనాథ రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య, కలికిరి సర్పంచ్ రెడ్డివారి ప్రతాపరెడ్డి, జడ్పిటిసి పద్మజా లోకవర్ధన్, ఎంపిపి నూర్జ హాన్, జిల్లా వైద్యాధికారి కృష్ణప్ప,ప్రధానోపాధ్యాయురాలు శారద, వైసిపి నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, నల్లారిశ్రీకర్ రెడ్డి, సతీష్ రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, రెడ్డివారి వెంకట్ రెడ్డి, చింతల రమేష్ రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందలూరు** : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి అధ్యక్షతన 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వమించారు.కార్యక్రమంలో ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు 42 ట్యాబ్‌లు, ఉపాధ్యాయులకు పది ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జయవేలు, ప్రధానో పాధ్యా యుడు గంగిరెడ్డి, ఉపాధ్యాయులు అల్లం అశోక్‌కుమార్, రౌఫ్ బాషా, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వైసిపి నాయకులు ఆర్ముగం విశ్వనాథ్, గుణయాదవ్, నడివీధి సుధాకర్, హిమగిరినాథ్ యాదవ్, గడికోట వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** నాణ్యమైన విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ భాష అన్నారు. ముష్టూరు పంచాయతీలోని కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలలో సర్పంచ్ చంద్రాయుడు, ఎంఇఒ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి పాల్గొని విద్యార్థులను ట్యాబ్‌లను అందజేశారు. కెజిబివి పాఠశాలలో రూ.పది లక్షల వ్యంతో షెడ్ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే నవాజ్‌బాష హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ రాజగోపాల్, ఎంపిడిఒ లీలా మాధవి, తహశీల్దార్ మంజుల, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, ఉషారాణి, మహదేవ రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ హరికుమార్, వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, చంద్రమోహన్, నవీన్, శశిధర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రాజగోపాల్, వెంకటరమణ, దయాకర్ రెడ్డి, శంకర, గంగాధర, గోపాల్, రవి, సిడిపిఒ సుజాత, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, ఎస్ఐ ఫాతిమా, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పుల్లంపేట** : మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు టాబ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు హరి, పద్మనాభయ్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ఓబులవారిపల్లి** : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్యాబ్ ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాగేంద్ర, సీనియర్ నాయకులు ముక్కా మధురెడ్డి, తాహశీల్దార్ పీర్ మున్ని, ఎంపిడిఒ విజయరావు, ఎంఇఒ పద్మజ, సర్పంచ్ జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న జయరామ నాయుడు, నాయకులు

అధికార పార్టీకో న్యాయం...ప్రతిపక్షానికో న్యాయమా?

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికార పార్టీకో న్యాయం, ప్రతిపక్షానికో న్యాయమా అని మదనపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీరామినేని జయరామ నాయుడు అధికారులను ప్రశ్నించారు. పట్టణంలోటిడిపి బ్యానర్లను తొలగింపునకు నిరసనగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ ప్రమీలను కలిసి బ్యానర్లను ఎందుకు తొలగించారని వివరణ అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వైసిపి కి చెందిన బ్యానర్లను అలాగే ఉంచి ప్రతిపక్ష పార్టీలకు చెందిన బ్యానర్లను తొలగించడం సమంజసం కాదన్నారు. అధికార పార్టీపైన ప్రభుత్వ అధికారులకు అంత మమకారం ఎందుకని ప్రశ్నించారు. బ్యానర్లు తొలగించాలనే ఆదేశాలు ఉంటే అన్ని పార్టీల బ్యానర్లను తొలగించా ల్సిందేనని స్పష్టం చేశారు. రెండు రోజుల్లోగా టిడిపి బ్యానర్లను తొలగించినట్లే పట్టణంలోని అన్ని బ్యానర్లను తొలగించాలని లేనియెడల మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు ,ఎస్.ఏ మస్తాన్, జెవి రమణ, పెంచుపాడుస్వామి పఠాన్ ఖాన్ రవి, బాబ్‌జాన్, దేవా, రమేష్, ఆదినారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

ఆటల పోటీలను ప్రారంభించిన జడ్పీ చైర్మన్

ప్రజాశక్తి-నందలూరు

స్వర్ణాంధ్ర సంస్థ 24 వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు వేపకుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అరవపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సిద్ధవరం గోపిరెడ్డి,సౌమ్యనాథ స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, సీనియర్ క్రీడాకారులు పల్లె గ్రీష్మంత రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, సిపిఐ జిల్లా నాయకులు మహేష్, స్వర్ణాంధ్ర సంస్థ సభ్యులు హరికుమార్, అభిషేక్, యశ్వంత్, యాసిన్, భరత్ కుమార్, రెడ్డప్ప, సాయి రెడ్డి, శేఖర్ బాబు, పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నవాజ్ భాషా అన్నారు. విద్యకు, వైద్యానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందే వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మకం పెంచాలని తెలిపారు. ఇప్పుడు ఇచ్చే సేవలకన్నా మరింత సేవలను పెంచాలని వైద్యులకు సూచించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ.... అర్హులై ఉండి ఎవరైనా ఇంటి పట్టా రాకుండా ఉంటే తమ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లోగా ఇంటి పట్టా మంజూరు చేస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ సమీక్షలో మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ భాష, ఆర్డీఓ మురళి, డీఎంహెచ్ ఓ డాక్టర్ కొండయ్య, మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.ఆంజనేయులు, అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గొల్లపల్లిలో టిబిపై సర్వేచేస్తున్న వైద్యబృందం

క్షయ రోగుల గుర్తింపునకు ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

క్షయ రోగులను గుర్తించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అంతటా 10 బృందాలతో ప్రతేక్య సర్వే చేపడుతున్నామని అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ డా.శైలజ, మదనపల్లి టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ బుధవారం నుంచి 14 రోజులపాటు జిల్లా అంతటా సర్వే చేస్తున్నామని అన్నారు. మదనపల్లి టిబి యూనిట్ కు సంబంధించి 4 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిబి సూపర్ వైజర్ ప్రభాకర్ మాట్లాడుతూ గొల్లపల్లి, పోతబోలు, పెద్దకురప్పల్లె, ముదివేడు గ్రామాలలో ప్రతేక్య వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి, సంబంధిత ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రతి రోజు 60 కుటుంబాలను సందర్శిస్తామని చెప్పారు. క్షయలక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారి గళ్ల నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపుతామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ఆన్లైన్‌లో నమోదుచేసి మందులు పంపిణీ చేస్తామని అన్నారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ సర్వే వల్ల క్షయరోగులకు సకాలంలో మెరుగైన చికిత్స అందుతుందని, ప్రజలందరూ సర్వే చేస్తున్న వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రమాదేవి, బాషా, ఆరోగ్య కార్యకర్తలు, సిహెచ్ఒలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దమండ్యం** : మండలంలోని కలిచర్ల గ్రామంలో టిబి, కుష్ఠువ్యాధి నియంత్రణ సర్వే అడిషనల్ డిఎంహెచ్ఒ శైలజ బుధవారం సర్వే ప్రారంభించారు. ఎఎన్ఎంలకు టిబి, కుష్ఠు వ్యాధుల గూర్చి తగు సూచనలు ఇచ్చారు. సర్వే అనంతరం పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు అన్ని పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు కెవికె కో-ఆర్డినేటర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కెవికెలో ఉన్న ప్రదర్శన క్షేత్రాలైన అజోల్ల వర్మికంపోస్టును పంటలలో వాడే విధానం గురించి వివరించారు. జీవామృతం తయారు చేసి ఎలా వాడాలో రైతులకు వివరించారు. కీటకవిభాగ శాస్త్రవేత్త డాక్టర్ కె.దేవకి పంటలలో జీవ శిలీంద్ర, జీవన ఎరువులైన ట్రైకోడెర్మా, సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్, రైజోబియం ఉపయోగాలు, పంటలలో ఎలా వాడాలనే దానిపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను మానండి

ప్రజాశక్తి-చిన్నమండెం

జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ ఆదేశాల మేరకు బుధవారం మం డలంలో గ్రామ మహిళా సంరక్షక కార్యదర్శుల ద్వారా మాదకద్రవ్యాలు విని యోగం, వాటి దుష్పరిణామాలపై విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. పలు గ్రామాలలో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేయడం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బయ్యప్పగారిపల్లెలో సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని బయ్యప్పగారిపల్లెలో సివిల్ రైట్స్‌డేని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ధనుంజయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికా రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

అభాగ్యుల ఇంటికి మరమ్మతులు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని మోడల్ స్కూల్లో చదివే పిల్లలు నివసిస్తున్న ఇంటికి అల్ మాదత్ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో లక్ష రూపాయలు ఖర్చు చేసి వారి ఇంటికి మరమ్మతులు చేయించారు. వారికి నివసించేందుకు ఇల్లు ఉన్నా వర్షం వస్తే తడిచిపోతుంది. కరెంటు సౌకర్యం కూడా లేదు. వారి అవస్థలను గమనించిన ఫౌండేషన్ సభ్యులు మోడల్ స్కూల్ అధ్యాపకుల సాయంతో వారి ఇంటికి మరమ్మతులు చేయించి బుధవారం పెద్దమండ్యం ఎస్ఐతో ప్రాంభించారు. కార్యక్రమంలో ఆల్ మాదత్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుక్కల దాడిలో జింకపిల్ల మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు



కుక్కల దాడిలో మృతి చెందిన జింక పిల్ల

పిటియం మండలం లోని కాట్న గల్లు గ్రామంలో కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందిన సంఘటన బుధ వారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మే రకు వివరాలిలా ఉన్నా యి. గ్రామ పొలి మేరల్లో మేతకోసం వచ్చిన జింకపిల్లపై కుక్కలు దాడి చేశాయని అన్నారు. సమీపంలోని రైతులు కుక్కలను తరిమి జింకను గ్రామంలోకి తరలిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. అటవీ శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో పోస్టు మార్టం నిర్వహించి ఖననం చేశారని తెలిపారు.

టిప్పర్, స్కూటర్ ఢీ : వాలంటీర్‌కు గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గోపగుడిపల్లి పంచాయతీ కాంపల్లి సమీ పంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్‌ను టిప్పర్ ఢీకొని స్కూటర్లో ప్రయాణిస్తున్న వాలంటీర్, ఆయన సోదరికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామాపురం మండలం గోపగుడిపల్లి పంచాయతీ కాంపల్లి హరిజనవాడ చెందిన వాలంటీర్ చెంచయ్య, సోదరి జ్యోతి స్కూటర్‌పై గువ్వల చెరువుకు వస్తుండగా కంపల్లి సమీపానికి రాగానే కడప వైపు నుంచి గోపగుడిపల్లెకు వైపు వెళుతున్న టిప్పర్ స్కూటర్‌ను ఢీకొంది ఈ సంఘటనలో వారి ఇరువురికి కాళ్లు విరిగాయి. రామాపురం పోలీసులు సంఘటన చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తమై 108 వాహనంలో కడప రిమ్స్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నాటు సారా విక్రయదారుడు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని కొండయ్యగారి పల్లిలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొండయ్యగారిపల్లికి చెందిన పల్లపు రవి నాటు సారాను తీసుకువచ్చి పల్లెకు సమీపంలోని చింత చెట్టు కింద చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి అమ్ము తున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ సమాచారం మేరకు నాటు సారా స్థావరంపై పోలీసులు దాడి చేసి పల్లపురవి ని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి ఎనిమిది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.